క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట : మెయిన్‌రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకుని మన్యుసూక్త హోమం గురువారం ఘనంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి తిథినాడు దేవాలయంలో ఈ హోమం నిర్వహణ జరుగుతుంది. అందులో భాగంగా హోమం నిర్వహించారు. నరఘోష, శత్రుఘోష, రుణబాధ నివారణ, గ్రహ శాంతి, కార్యసిద్ధి కోసం నిర్వహించిన ఈ హోమంలో రూ. 516 చెల్లించిన భక్తులు పాల్గొన్నట్లు దేవాలయం ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. హోమం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఫిబ్రవరి 5,6 తేదీల్లో భారతీయ భాషల్లో విద్య–సాంకేతిక పదజాలం ప్రాధాన్యతపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ కమిషన్ న్యూఢిల్లీ నేతృత్వంలో కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో ఈ సదస్సు జరగనుందని తెలిపారు. కళాశాలలో గురువారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సాంకేతిక పదజాలం వినియోగంలో ప్రాంతీయ భాషల ప్రాధాన్యతని గుర్తిస్తూ తెలుగు, హిందీ భాషల్లో సీఎస్‌టీటీ సంస్థ తమ కళాశాలలో సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో–ఆర్డినేటర్, ద్వితీయ భాషా విభాగాధ్యక్షురాలు పి.కె. జయలక్ష్మి తెలిపారు. ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల యువత ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, డాక్టర్ గౌరీనాయుడు, సిస్టర్ జైన్ థామస్, డాక్టర్ భాస్కరసుధ తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవసరానికి తమను ఆదుకున్నారని డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం వద్ద అక్కచెల్లెమ్మలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. సీఎం మహిళా పక్షపాతి అని.. అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని వారంతా ముక్తకంఠంతో తెలిపారు.

- డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెల్లింపులు
- స్వయం సహాయక సంఘాల మహిళల హర్షం
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, నాయకులు

అల్లిపురం : డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి వరుసగా నాల్గోసారి రుణమాఫీ నగదు చెల్లించారు. దీంతో మహిళా సంఘాల సభ్యురాళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆసరా సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. అక్కచెల్లెమ్మల మోముల్లో నవ్వుల సిరులు కురుస్తున్నాయి. ఈ సందర్భంగా అక్కచెల్లెమ్మలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్యమంత్రికి మనసారా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్కరికి నాల్గవ విడత రుణమాఫీగా రూ.11 వేలు చొప్పున అకౌంట్లలో పడ్డాయని తెలిపారు. జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం వద్ద ఆసరా నిధులు పడిన డ్వాక్రా సంఘాల మహిళలు గురువారం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, ఆర్పీ శిరీష, వలంటీర్లు యల్లంకి ఝాన్సీ, హేమలత, కనకదుర్గ, విజయ సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకుని రాష్ట్రాభివృద్ధితో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు.

'ఆసరా' అండగా నిలిచింది..



జగనన్న 'ఆసరా' మాకు అండగా నిలిచింది. మా గ్రూపు సభ్యులు ఒక్కొక్కరికి రూ.11 వేలు చొప్పున మాఫీ నిధులు వచ్చాయి. ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి అండగా నిలిచారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించుకుంటాం.

– వియ్యపు దేవిక, కుమ్మరవీధి

ఆదుకున్న జగనన్న..



ఇప్పటి వరకు వచ్చిన 'ఆసరా' డబ్బులు మా కుటుంబానికి అండగా నిలిచాయి. మాకు అవసరం ఉందని అనుకుంటుండగా జగనన్న డబ్బులు వేసి అండగా నిలిచారు. ఎంతన్నది కాదు, అవసరం తీరిందా అన్నదే చూడాలి. నాలుగు విడతలుగా రుణమాఫీ అందింది. అవసరానికి డబ్బులు అందించి జగనన్న మమ్మల్ని ఆదుకున్నారు.

– దుబాసి గౌరమ్మ, అమ్మవారివీధి

జగనన్నకు రుణపడి ఉంటాం..



వైఎస్సార్ 'ఆసరా' ద్వారా ఒక్కొక్క సభ్యురాలికి రూ.11 వేలు వచ్చింది. గతంలో ప్రభుత్వం జమ చేసిన నగదు మా కుటుంబానికి అండగా నిలిచింది. పేదల కోసం ఆలోచించే ఈ ప్రభుత్వ పాలన ఎంతో బాగుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– డి.అమ్మాజీ, కుమ్మరవీధి

ముఖ్యమంత్రి సభకు తరలిరండి



కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : ఈ నెల 27న సంగివలసలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. 29వ వార్డులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీతల వాసుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయానికి అండగా ఈ నెల 27న భీమిలి సంగివలసలో నిర్వహించనున్న సీఎం క్యాడర్ సమావేశానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా అందర్నీ కలుపుకుని తీసుకురావాలన్నారు. సీఎం క్యాడర్ సమావేశంలో నియోజకవర్గం సత్తా చాటాలన్నారు. మంచి నాయకత్వ లక్షణాలు గల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుని ప్రజా విజయాన్ని అందించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

31వ వార్డులో..

27న భీమిలి నియోజకవర్గం సంగివలసలో నిర్వహించనున్న సీఎం సభకు మేము సైతం సిద్ధమంటూ 31వ వార్డులో గురువారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు వార్డు పరిధి గొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గారి రాంబాబు, నాయుడు, బాబూరావు, కొండా భవాని, దండం వెంకటేష్, కొండ శ్రీదేవి, కుమార్, నీరజ, శ్రీను, దండ గణేష్, పిలక మోహన్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రక్ష.. 'జగనన్న సురక్ష'



చికిత్స పొందుతున్న మహిళ వివరాలు తెలుసుకుంటున్న పద్మావతి



తమ వివరాలు నమోదు చేయించుకుంటున్న లబ్ధిదారులు

- 34 వ వార్డు కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. వార్డులోని కొబ్బరితోట–2 సచివాలయం పరిధిలో గల వారికి గురువారం డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ పద్మావతి, పార్టీ నాయకులు దూడ అప్పారావు తదితరులు పర్యవేక్షించారు. గురువారం జరిగిన శిబిరంలో మొత్తం 511 మందికి వైద్య సేవలు అందించారు. వారికి అన్ని రకాల ఆరోగ్య చేసి మందులు అందజేశారు. ముగ్గురుని మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం వల్ల కలిగే లాభాలను శిబిరానికి వచ్చిన వారికి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపథంలో నియోజకవర్గం

- రూ. వంద కోట్లతో పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : పురాతన ప్రాంతాలు కలిగిన నియోజకవర్గం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అందంగా రూపొందుతున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ 27వ వార్డు హిందూ ముస్లిం కాలనీలో కార్పొరేటర్ వీరారావు, వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రూ. 86 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 21.10 లక్షలతో డైమండ్ పార్కు వద్ద బీటీ రోడ్డు, రూ. 36.58 లక్షలతో శ్రీనగర్‌లో శ్మశాన వాటిక, రూ. 28 లక్షలతో హిందూ ముస్లిం కాలనీలో జి–ప్లస్ వన్ కమ్యూనిటీ భవనానికి శ్రీకారం చుట్టామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేదలకు మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి, సంక్షేమం అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. నియోజకవరంగలోని అన్ని వార్డులను రూ. వంద కోట్లతో అభివృద్ధి చేస్తామని.. పార్కులు, డ్రైనేజీలు, బరియల్ గ్రౌండ్లు, జగదాంబ నుంచి పాత పోస్టాఫీస్ వరకు విశాలమైన రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే పనులు ప్రారంభించామని తెలిపారు. జగదాంబ వద్ద క్లాక్ టవర్‌తో పాటు పాత పోస్టాఫీస్ సర్కిల్‌ను ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. 38వ వార్డులోని విశ్వబ్రాహ్మిణ్ సామాజిక భవన నిర్మాణానికి రూ. 46.50 లక్షల అంచనాతో ఇప్పటికే అప్రూవల్ తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తామన్నారు. 2024లో మరల ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ నిహారిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణం తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో బహిరంగ వేలం

డాబాగార్డెన్స్ : జోన్–4, 5 పరిధిలో పలు వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయా జోనల్ కమిషనర్లు శివప్రసాద్, ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్–4లో వాణిజ్య సముదాయాలు, సర్దార్ వల్లభాయి పటేల్(పూర్ణా మార్కెట్), రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి ఫిష్ మార్కెట్‌కు ఈ నెల 31 ఉదయం 11 గంటలకు సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలోనూ, జోన్–5కి సంబంధించి పలు వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, పలు మార్కెట్లకు సంబంధించి ఈ నెల 30 ఉదయం 11 గంటలకు జోనల్ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు షెడ్యూల్ నిబంధనలకు లోబడి వేలం పాటలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

అల్లిపురం : మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని గంగవరం సాంప్రదాయ సాగర మత్స్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చోడిపిల్లి రాజు డిమాండ్ చేశారు. గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోస్టల్ ఏరియాలో వెనుకబడిన మత్స్యకార సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు మత్స్యకార వర్గానికి ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సూరాడ ఎల్లాజీరావు, వాసుపల్లి సత్తిబాబు, పేర్ల నూకరాజు, ఎల్లిబిల్లి అప్పారావు, రమాదేవి పాల్గొన్నారు.

సామాన్యుడి వజ్రాయుధం.. ఓటు హక్కు



పోటీలో గెలుపొందిన విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. కళాశాల రాజనీతి శాస్త్రం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటు ప్రాధాన్యతను అధ్యాపకులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు ఎస్. మహేశ్వరి, డి ప్రవల్లిక, టి హేమగంగకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు జి. జ్యోతి, డాక్టర్ బి. నాగమణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్. అనురాధ, డాక్టర్ జె. లావణ్య, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

జన జాగరణ సమితి చైతన్య ర్యాలీ..

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జన జాగరణ సమితి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో ఓటరు చైతన్య ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ ప్రపంచంలోనే ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వినియోగించుకోకపోవడం అన్నింటి కంటే పెద్ద సామాజిక నేరంగా జన జాగరణ సమితి భావిస్తోందన్నారు. ఓటు వేసేందుకు ఆసక్తి చూపని వారు కూడా ఓటు వేసేలా చైతన్యపరిచే లక్ష్యంగా జన జాగరణ సమితి ఓటర్లను జాగృతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, సామాజిక కార్యకర్త శ్రీహరికృష్ణ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పూర్వ వీసీ హనుమంతు లజపతిరాయ్

సీతమ్మధార : యక్సాక్ కొరియన్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొంది పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. గురువారం ద్వారకానగర్ రెండవ లైన్‌లోని సంస్థలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్శిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కొరియా భాష నేర్చుకున్న వారికి వేల సంఖ్యలో ఉద్యోగాలు ఎదురు చూస్తున్నాయన్నారు. దక్షిణ కొరియా మన దేశానికి చెందిన 10+2 చదివి, పాలిటెక్నిక్ డిప్లొమా కలిగిన వారిని, డీజిల్ మెకానిక్, డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, వెల్డర్ల వంటి నైపుణ్యంతో పాటు కొరియా భాష అర్థం చేసుకోగలిగితే చక్కటి ఉపాధి అందిస్తుందన్నారు. నెలకు భారత కరెన్సీలో రూ. రెండు లక్షల వరకు వేతనం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంత్, కొరియన్ టీచర్ గ్రేసీ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ ఎడ్యుకేషన్‌పై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన సోషియాలజికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. వర్తమాన సమాజానికి ఉపయుక్తంగా టీచర్ ఎడ్యుకేషన్‌లో విభిన్న కోణాలను స్పృశిస్తూ పుస్తక రచన చేసిన షారోన్‌రాజుని వీసీ అభినందించారు. అనంతరం రచయిత మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, పూర్వ పాలక మండలి సభ్యులు గిరిజా అగస్టీన్, సీడీసీ డీన్ ఆచార్య సి.ఎమ్.వి.సత్యనారాయణరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా పునర్వసు నక్షత్ర హోమం



సీతారాముల ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై గంధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో వేంచేయజేశారు. హోమగుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

27వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని ద్వారకానగర్ ఆరవ లైన్‌లో గల సచివాలయం వద్ద పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. 80 మంది లబ్ధిదారులకు వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి చేతుల మీదగా పట్టాలందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఐదు సచివాలయాలకు సంబంధించి పట్టాలు అందించినట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


విలువల నిలయం జనకులం



జనకులం పూర్వ అద్యాకులు, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ఆధునిక విద్యాబోధనతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, నైతిక విలువలను విద్యార్థి దశలోనే నేర్పించే విలువలతో కూడిన నిలయం జనకులం అని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో గురువారం జనకులం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ జనకులం విద్యాలయాన్ని విశాఖలో 1968 సంవత్సరంలో మాస్టర్ ఈకే నెలకొల్పారని, ఆనాటి నుంచి అనేకమంది ఉన్నత విలువలతో కూడిన విద్యతోపాటు సామాజిక సేవల్లో కూడా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మరో ముఖ్య అతిథి జగద్గురుపీఠం సలహా మండలి సభ్యులు సీహెచ్‌ఎస్‌ఎన్ రాజు మాట్లాడుతూ దేశరక్షణలో యోధులు, కర్షకులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విశిష్టమైనదని తెలియజేశారు. జనకులం పూర్వ విద్యార్థులు డాక్టర్ గూటాల వెంకటరమణ (న్యూయార్క్), ఇంద్రగంటి కాశీప్రసాద్, గొల్లపూడి రవికుమార్, జగద్గురుపీఠం కార్యదర్శి బీఆర్‌కే రాజు, పి.కృష్ణమోహన్, పి.లక్ష్మీదేవి, ఎక్కిరాల సుదర్శనం, బాలబాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.వి. శుభశ్రీ, జగద్గురుపీఠం కార్యనిర్వాహక సభ్యురాలు బి.ఉషారాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో స్వామికి పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు.